రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కె.శశాంక గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి బదిలీపై ఆయన రంగారెడ్డి జిల్లాకు వచ్చారు. ప్రభుత్వ సంబంధిత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో శశాంక తనదైన మార్క్‌ను ప్రదర్శిస్తారన్న మంచి పేరు ఉంది. 2013వ బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన శశాంక రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పనిచేశారు. కరీంనగర్, గద్వాల్, మహబూబాబాద్ జిల్లాల్లో కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు ఇతర రాష్ట్రాల్లో శశాంక పనిచేశారు. శశాంక స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్ద పడిశాల. మోత్కూరు మండలంలోని బుజిలాపురంలోని మేనమామ వద్ద ఉండి 10వ తరగతి వరకు మోత్కూరులో చదివారు. శశాంక సతీమణి సింధూశర్మ ఐపీఎస్‌గా పని చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో శశాంక పోడు పట్టాల భూముల పంపిణీలో తనదైన పాత్ర పోషించారు. 2022లో భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి రాకపోకలకు అంతరాయం కలిగిన సందర్భంలో గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందుగానే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ తనదైన శైలిలో చొరవ చూపారు. విధులు నిర్వర్తించిన ప్రతీ చోట నిక్కచ్చిగా, వివాదరహితుడిగా ప్రశంసలు అందుకున్నారు.

- రంగారెడ్డి, జనవరి 4 (నమస్తే తెలంగాణ)

## రంగారెడ్డి కలెక్టర్‌గా

# శశాంక బాధ్యతల స్వీకరణ

- అభివృద్ధి పనుల్లో తనదైన మార్క్
- వివాదరహితుడిగా అందరి మన్నన



రంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శశాంకకు బొకే అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గౌతమ్

### ఏడాదిలో నలుగురు కలెక్టర్ల మార్పు

రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వర్తించడం కత్తిమీద సాము లాంటిదే. నిబద్ధత అధికారిగా మంచి పేరు ఉన్నవారు సైతం వివాదాస్పద అంశాల్లో ఇరుక్కుని అనతికాలంలోనే బదిలీపై వెళ్తున్నారు. ఏడాది క్రితం కలెక్టర్‌గా ఇక్కడకు వచ్చిన హరీశ్‌పై ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఆయనపై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో భారతీ హోళీకేరికి ప్రభుత్వం కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. అక్టోబర్ 13న ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోగా ధరణి పోర్టల్‌లో వెలుగుజూసిన అక్రమాల నేపథ్యంలో ఆమెపై కూడా బదిలీ వేటు పడింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన 73 రోజుల వ్యవధిలోనే ఆమెపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆ తర్వాత మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రుకు ఇటీవలే పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం.. తాజాగా శశాంకకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ బాధ్యతలను అప్పగించింది.

### గురుతర బాధ్యతలు ప్రస్తుత కలెక్టర్‌పై..

ఇటీవల ధరణి పోర్టల్ అక్రమాల అంశం జిల్లాకు మాయని మచ్చగా ఉండిపోయింది. హైదరాబాద్ నగరంతో పోటీపడుతున్న రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు పెరగడంతో కబ్జాలు, ఇతరత్రా అక్రమాలు సైతం పెద్దఎత్తున చోటు చేసుకుంటున్నాయి. భూదాన్, వక్ఫ్ భూములు, దేవాదాయ శాఖ, అసైన్డ్ భూముల అన్యాక్రాంతం వంటివి పరిష్కరించడం కలెక్టర్ ముందున్న పెద్ద సవాలే. రాజకీయపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొని ముందుకు సాగడం కత్తిమీద సామే.. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు జరగనుండడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను సక్సెస్ చేయడం వంటి గురుతర బాధ్యతలు ప్రస్తుత కలెక్టర్‌పై ఉన్నాయి.

### కలెక్టర్‌కు స్వాగతం..

రంగారెడ్డి కలెక్టర్‌గా కె.శశాంక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిన నూతన కలెక్టర్‌కు అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శశాంకకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఉన్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు, అదనపు కలెక్టర్లు భూపాల్ రెడ్డి, ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా పూల బొకేలు అందించారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

## రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 4 : వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా తనిఖీల్లో భాగంగా డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో వింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వింగ్‌కు సంబంధించిన ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో డీసీఆర్‌బీ ఒక ముఖ్యమైన విభాగమని, డీసీఆర్‌బీలో పనిచేసే అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరణ చేసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లలో దొంగతనాలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిని నియంత్రించాలన్నారు. పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను తెలుపుతూ జిల్లాలో శాంతిభద్రతలను కాపాడుటలో ప్రముఖ పాత్ర వహించాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న చోరీ కేసులపై దృష్టి పెట్టాలన్నారు. తరచుగా నేరాలకు పాల్పడుతున్నవారి రికార్డులను ఏర్పాటు చేసి సస్పెక్ట్ షీట్స్, రౌడీ షీట్స్ తెరువాలని ఆదేశించారు. పద్ధతి మార్చుకోని వారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయాలన్నారు. ఈ చలాన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ జానయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఎస్సైలున్నారు.

## ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

ధారూరు, జనవరి 4 : జిల్లాలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం ధారూరు మండలం మున్నూర్ సోమారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయ హస్తం కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలను అమలుపరచడానికి అర్హులైన ప్రజల నుంచి ప్రజా పాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను సేకరిస్తున్నామన్నారు. చివరి వరుసలో ఉన్న పేదవారికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వయంగా మీ ఊరికి వచ్చిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. కుటుంబం నుంచి ఒకరు వచ్చి దరఖాస్తు చేస్తే సరిపోతుందని, అన్ని పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ధారూరు తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీవో షఫీఉల్లా, సర్పంచ్ అనూష, ఎంపీటీసీ రవికుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.



గ్రామ సభలో కౌంటర్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



ఆర్థిక సహాయాన్ని అందుకుంటున్న దివ్యాంగుడు

## స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

### డీఆర్‌డీవో అడిషనల్ పీడీ నర్సింహులు

వికారాబాద్, జనవరి 4 : దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్డీవో అడిషనల్ పీడీ నర్సింహులు అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఐకేపీ కార్యాలయంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సిడ్నీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చిన్న, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలైనటువంటి దివ్యాంగులను గుర్తించి, వారి ప్రతిభకు తగ్గట్టుగా వారు చేస్తున్న వ్యాపారాలను బలోపేతం చేస్తూ మెరుగైన జీవనోపాధిని పొందడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అర్హులైన దివ్యాంగులు 43 మందికి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని ఇచ్చినట్లు తెలిపారు. నిరుపేద దివ్యాంగులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. సిడ్నీ ప్రతినిధి దక్షిణామూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మి, పీఎన్ శ్రీనివాస్, ఉదయ్, జిల్లా కో ఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ లీడర్లు సంజీవరావు, రాములు, శ్రీశైలం, యాదయ్య, లబ్ధిదారులు బాలరాజు, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యసేవలు

- షాబాద్ దవాఖాన రూపురేఖలు మారుస్తాం
- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్



షాబాద్ ప్రభుత్వ దవాఖానలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, జనవరి 4 : ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలందించేలా కృషి చేస్తున్నామని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం షాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. అనంతరం దవాఖానలో సెర్ప్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానకు వచ్చే పేదలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. సెర్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దవాఖానకు మరమ్మతులు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. దవాఖాన ఆవరణలో ప్రతి వారం చిన్న పిల్లలకు టీకాలిచ్చేలా సదుపాయం కల్పించనున్నామన్నారు. అదేవిధంగా సమావేశ మందిరం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 24 గంటలు దవాఖానలో అంబులెన్స్ అందుబాటులో ఉండేలా షెడ్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాన్పుల కోసం మహిళలు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానల్లోనే కాన్పులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దవాఖానకు వచ్చే రోగులు కూర్చోవడానికి అరుగులు, ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో దవాఖానలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, సిబ్బంది ఉన్నారు.

## బ్రెయిలీ లిపితో అంధులు ఉన్నత స్థాయికి..

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 4 : లూయిస్ బ్రెయిలీ అంధుల లిపి కనుక్కోవడం అనేది చాలా గొప్ప విషయమని, చాలా మంది ఈ లిపిని ఉపయోగించి ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగారని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ చేసిన కృషిని గుర్తుంచుకొని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అంధుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలితాకుమారి మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపి ద్వారా ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది అంధులకు అక్షరజ్ఞానం కలిగించారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ జయరాంనాయక్, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, ఎఫ్‌ఆర్‌వో వెంకటేశ్ పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీ జయంతిని జరుపుకొంటున్న అధికారులు, దివ్యాంగులు



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కులకచర్ల, జనవరి 4 : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కులకచర్ల వ్యవసాయాధికారి వీరస్వామి అన్నారు. గురువారం కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనధన్ పథకం, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, హెల్త్ క్యాంపు తదితర వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆధార్ కార్డులు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికి బ్యాంకుల్లో ఖాతా ఉంటే ఈ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, టీజీబీ బ్యాంకు మేనేజర్లు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.